నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి

- సమస్యలున్న వార్డుల్లో బోర్ల ద్వారా సరఫరా చేయాలి
- వారానికి ఒకసారి ట్యాంక్‌లను శుభ్రం చేయాలి
- భూపాలపల్లి కలెక్టర్ భవేశ్‌మిశ్రా

మహిళతో మాట్లాడుతున్న కలెక్టర్ భవేశ్‌మిశ్రా

కృష్ణకాలనీ, మార్చి 17 : వేసవిలో భూపాలపల్లి పట్టణ ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ భవేశ్‌మిశ్రా మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధి 19, 25 వార్డుల్లోని ఎల్‌బీనగర్, కారల్‌మార్క్స్ కాలనీల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. నల్లాల ద్వారా నీరు వస్తుందా? కుటుంబ అవసరాలకు సరిపోతున్నాయా? అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎల్‌బీనగర్‌లోని వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో జోన్ల వారీగా ఏర్పాటు చేసిన 6 ట్యాంకులను వారానికోసారి శుభ్రం చేయాలని ఆదేశించారు. మున్సిపాలిటీలో నీటి సమస్య ఎక్కువగా ఉన్న వార్డులను గుర్తించి బోర్ల ద్వారా సరఫరా చేయాలని సూచించారు. వేసవిలో ప్రజలకు నీటి ఇబ్బందులు లేకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడైనా పైప్‌లైన్లు లీకేజైనా, పగిలిపోయినా వెంటనే గ్రిడ్ ఇంజినీర్‌కు సమాచారం ఇవ్వాలని, సత్వరమే మరమ్మతు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆయన వెంట అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, టీపీ సునీల్, ఏఈ పాల్గొన్నారు.

పూలే, అంబేద్కర్ సేవారత్న అవార్డులు

మాట్లాడుతున్న లింగమల్ల శంకర్

కృష్ణకాలనీ, మార్చి 17 : మహనీయుల ఆశయ సాధనకు కృషి చేస్తున్న, సామాజిక సేవలందిస్తున్న వారికి పూలే, అంబేద్కర్ సేవా రత్న అవార్డులు అందించనున్నట్లు ఆల్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్ల శంకర్ తెలిపారు. వచ్చేనెల 14న బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని వీటిని ప్రదానం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కాకతీయ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శంకర్ మాట్లాడుతూ సొసైటీలోని వనరుల మేరకు మహనీయుల జయంతి, వర్ధంతి వేడుకలు నిర్వహిస్తామని, వారి జీవిత చరిత్రను ముద్రించి విద్యార్థులకు అందజేస్తామన్నారు. అనంతరం అంబేద్కర్ జయంతి ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. సమావేశంలో సభ్యులు చింతల కుమార్, పీక కిరణ్, వెంకటస్వామి, రాంచందర్, రాకేశ్, వోనపాకల రాజయ్య, కిష్టస్వామి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యంపై నిర్లక్ష్యం!

- భూపాలపల్లి మున్సిపాలిటీలో నత్తనడకన పన్నుల వసూళ్లు
- రావాల్సిన బకాయిలు రూ. 6.20 కోట్లు
- ఇప్పటి వరకు వసూలైనవి రూ. 3.43 కోట్లు
- 90 శాతం వడ్డీ రాయితీపై కొరవడిన ప్రచారం
- ఇంకా మిగిలింది 14 రోజులే..
- ఉదాసీనంగా అధికారులు

భూపాలపల్లి మున్సిపాలిటీ కార్యాలయం

జంగేడులో పన్నులు వసూలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

కృష్ణకాలనీ, మార్చి 17 : భూపాలపల్లి మున్సిపాలిటీలో ఇంటి, ఆస్తి పన్నుల వసూలు నత్తనడకన సాగుతున్నది. ఈ నెల చివరి వరకు వంద శాతం చేరుకోవాలన్న ఉన్నతాధికారుల ఆదేశాలను అధికారులు పట్టించుకోవడంలేదు. రాష్ట్ర ప్రభుత్వం బకాయిల వడ్డీపై 90 శాతం రాయితీ ప్రకటించినా అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. దీంతో పన్నుల వసూలు కష్టంగా మారింది. మున్సిపాలిటీ పరిధిలో రూ. 6,20,44,000 వసూలు చేయాలనే లక్ష్యంతో జనవరి నుంచే 9 ప్రత్యేక బృందాలతో ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఇప్పటి వరకు రూ. 3,43,19,361 మాత్రమే వసూలు చేశారు. ఇంకా రూ. 2,77,24,639 వసూలు కావాల్సి ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా 14 రోజులే మిగిలున్నాయి. వంద శాతం లక్ష్యం సాధిస్తారా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కాగా, మున్సిపాలిటీ పరిధిలో 262 మంది మొండి బకాయిదారులున్నట్లు అధికారులు గుర్తించి వారికి రెడ్ నోటీసులు సైతం జారీచేశారు. ఇందులో 154 మంది తమ బకాయిల్లో సగం మొత్తాన్ని మాత్రమే చెల్లించారు. మిగతా వారు బకాయి చెల్లించేందుకు ఆసక్తి చూపడం లేదని సిబ్బంది అంటున్నారు. అయితే వీరంతా గడువులోపు పన్నులు చెల్లించని పక్షంలో వారి ఆస్తులను జప్తు చేయాల్సి ఉంటుంది. కానీ అలా జరిగిన సందర్భాలు ఇప్పటి వరకు లేవు. దీనికి తోడు సింగరేణితో పాటు ఇతర ప్రభుత్వ శాఖలకు చెందిన బకాయిలు రూ. 2.17 కోట్లుండగా, కేవలం రూ. 30.82 లక్షలు మాత్రమే వసూలయ్యాయి. వీటిని చెల్లించేందుకు ఆయా శాఖల అధికారులు చొరవ చూపడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

అధికారుల పర్యవేక్షణ కరువు

ఇంటి, ఆస్తి పన్నులు వసూలు చేస్తేనే సిబ్బంది జీత భత్యాలు చెల్లించడంతో పాటు అభివృద్ధి పనులు కొనసాగించే వీలుంటుంది. అయితే వీటి వసూలుకు బిల్ కలెక్టర్, ఇతర కిందిస్థాయి సిబ్బంది మాత్రమే తిరుగుతున్నప్పటికీ వారిపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. సిబ్బందితో పాటు మున్సిపల్ అధికారులు వెంట ఉండి బకాయిదారులపై ఒత్తిడి తెస్తేనే వసూలయ్యే అవకాశం ఉంటుంది. కానీ, అధికారులు పట్టింపులేనట్లుగా కార్యాలయానికే పరిమితమవుతున్నారు.

దీంతో అనుకున్న స్థాయిలో బకాయిలు వసూలు కావడం లేదు. ఇదే విషయమై ఇటీవల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు అధికారులు సైతం పాల్గొనాలని ఆదేశించినప్పటికీ వారు క్షేత్రస్థాయిలో కనిపించకపోడం గమనార్హం.

వంద శాతం వసూలు చేస్తం

ఈ నెలాఖరు వరకు 100 శాతం పన్నులు వసూలు చేసి అధికారుల టార్గెట్‌ను పూర్తిచేస్తాం. ఇప్పటికే 61 శాతం మేర వసూలు చేశాం. ప్రజలందరూ పన్నుల వసూళ్లకు సహకరించి మున్సిపాలిటీ అభివృద్ధికి పాటుపడాలి.
– వేల్పుల భాస్కర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, భూపాలపల్లి మున్సిపాలిటీ

ఫ్లెక్సీలు, వాల్‌రైటింగ్‌ల తొలగింపు

వాల్ రైటింగ్‌ను తొలగిస్తున్న సిబ్బంది

గణపురం/మహదేవపూర్, మార్చి 17 : పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో అధికారులు కోడ్ అమలుకు శ్రీకారం చుట్టారు. గణపురం మండల కేంద్రంలోని ఎన్టీఆర్, రాజీవ్‌గాంధీ, తెలంగాణ తల్లి విగ్రహాలకు ఆదివారం ముసుగులు వేశారు. మహదేవపూర్‌లోని ఆయా గ్రామాల్లో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, వాల్ రైటింగ్‌లను తొలగించారు. పటిష్టంగా ఎన్నికల కోడ్ అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. గణపురం తహసీల్దార్ మురళీధర్‌రావు, ఎంపీడీవో భాస్కర్, ఎస్సై సాంబమూర్తి, జీపీ కార్యదర్శులు సమ్మయ్య, రాజు, రాజ్‌కుమార్, సతీశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి సరిహద్దు ప్రాంతాల పరిశీలన

గోదావరి తీరాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ

మంగపేట, మార్చి17 : ములుగు జిల్లా సరిహద్దు ప్రాంతంలో ఉన్న మంగపేట మండలంలోని అకినేపల్లిమల్లారం శివారు గోదావరి ఫెర్రీ పాయింటు, బ్రాహ్మణపల్లి చెక్‌పోస్టును ఆదివారం ఏఎస్పీ గీతమహేశ్ బాబాసాహెబ్ పరిశీలించారు. ఎన్నికల నేపథ్యంలో స్థానిక పోలీసులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఏటూరునాగారం సీఐ మండల రాజు, మంగపేట ఎస్సై గోదరి రవికుమార్, సిబ్బంది ఉన్నారు.

8 లీటర్ల గుడుంబా పట్టివేత : ఇద్దరిపై కేసు

చిట్యాల, మార్చి 17 : రవాణా చేస్తున్న గుడుంబాను పట్టుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎండీ షాఖాన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చల్లగరిగెలో తనిఖీలు చేస్తుండగా ఓదెల మొగిలి తన ఇంటి ముందు 8 లీటర్ల గుడుంబా క్యాన్‌ను పట్టుకొని ఉన్నాడు. ఇదేమిటని విచారించగా భావుసింగ్‌పల్లి గ్రామానికి చెందిన అజ్మీరా శ్రీనివాస్ నుంచి తక్కువ ధరకు తీసుకొచ్చి గ్రామంలో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. దీంతో వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ సురేందర్, నవీన్, అస్లాంజాని తదితరులు పాల్గొన్నారు.

ఆరు లారీల పట్టివేత

స్వాధీనం చేసుకున్న ఇసుక లారీలు

కాటారం, మార్చి 17 : అనుమతులు లేకుండా మానేరు నది నుంచి ఇసుకను తరలిస్తున్న ఆరు లారీలను పోలీసులు పట్టుకున్నారు. వారి కథనం మేరకు.. సీఐ నాగార్జునరావు ఆధ్వర్యంలో కొయ్యూరు, కాటారం ఎస్‌ఐలు నరేశ్, అభినవ్ ఆదివారం తెల్లవారుజామున తనిఖీలు చేపట్టారు. మానేరు నుంచి ఇసుకను హనుమకొండకు తరలిస్తుండగా కొయ్యూరు పరిధిలో రెండు, కాటారం పరిధిలోని మేడిపల్లి సమీపంలో నాలుగు లారీలను పట్టుకొని సీజ్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఇక మీదట ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

ఫ్రీ బస్సుతో ప్రయాణికుల కష్టాలు

గంటల తరబడి వేచివున్నా రాని బస్సులు

బస్సులో స్థలం లేకపోయినా ఎక్కుతున్న ప్రయాణికులు

తాడ్వాయి, మార్చి17 : రాష్ట్రంలో ఫ్రీ బస్సుల మాటేమోగానీ ప్రయాణికులు గంటల తరబడి రోడ్లపై వేచి ఉండాల్సి వస్తోంది. రద్దీకి తగ్గట్లు ప్రభుత్వం బస్సులు నడపకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గంటకు, రెండు గంటలకు ఒక బస్సు వస్తే దాంట్లో సీటింగ్ కెపాసిటీకి మించి ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ఆదివారం ప్రయాణికులు బస్సుల కోసం రెండు గంటల పాటు వేచి ఉన్నా బస్సులు రాలేదు. తర్వాత ఒక బస్సు రాగా దాంట్లో అప్పటికే నిలబడి ప్రయాణికులు ఉండగా బస్సు కోసం మరో 40 మంది దాకా వేచి ఉన్నారు. ఆ బస్సులో స్థలం లేకపోయినా ఆలస్యవుతుండడంతో ఇబ్బంది పడుకుంటూనే ఎక్కి వెళ్లిపోయారు. ప్రభుత్వం బస్సు సర్వీసులను పెంచకుండా ఇబ్బందులకు గురి చేస్తుందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి పది పరీక్షలు

- భూపాలపల్లిలో 20 కేంద్రాలు.. 3,547 మంది.. ములుగులో 21 కేంద్రాలు.. 3,088 మంది విద్యార్థులు
- రెండు జిల్లాల్లో ఏర్పాట్లు పూర్తి

ములుగు, మార్చి17 (నమస్తే తెలంగాణ)/భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయా జిల్లాల డీఈవోలు ఎన్ రాంకుమార్, పాణిని తెలిపారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగనున్నాయని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు వారు పేర్కొన్నారు. భూపాలపల్లి జిల్లాలో 20 కేంద్రాల్లో 3,547 మంది, ములుగు జిల్లాలో 21 కేంద్రాల్లో 3,088 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. గంట ముందు నుంచే పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులను అనుమతిస్తామన్నారు. సెంటర్లలో విధులు నిర్వర్తించే ఉద్యోగులు, సిబ్బంది సెల్‌ఫోన్ తీసుకెళ్లడానికి అనుమతి లేదన్నారు. కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, సెంటర్ల నుంచి 100 మీటర్ల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, సమీపంలోని జిరాక్స్ షాపులను మూసివేయాలని డీఈవోలు తెలిపారు. కాగా, విద్యార్థుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేశారు.

పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు

ఎస్పీ శబరీష్

ములుగు (నమస్తే తెలంగాణ) : ములుగు జిల్లా వ్యాప్తంగా జరిగే 10వ తరగతి బోర్డు పరీక్షలకు పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ శబరీష్ వెల్లడించారు. ఆదివారం ఆయన మాట్లాడారు. పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఉంటుందని తెలిపారు. ఇందులో భాగంగా 250మంది పోలీస్ అధికారులు, సిబ్బందికి విధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని ఆదేశించారు. అలాగే కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. నిబంధనలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కృష్ణకాలనీ, మార్చి 17 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. భూపాలపల్లి సీఐ నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జంగేడుకు చెందిన ఆర్‌ఎంపీ డాక్టర్ ఏమగొండ సాంబయ్య భూపాలపల్లి జిల్లా కేంద్రానికి బైక్‌పై వచ్చి, తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో అంబేద్కర్ సెంటర వద్ద లారీ వెనుక నుంచి ఢీకొంది. దీంతో సాంబయ్యకు తీవ్ర గాయాలు కావడంతో పాటు కాలు విరిగిపోయింది. బాధితుడి కుమారుడు భరత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

భూపాలపల్లి రూరల్, మార్చి 17 : సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన మండలంలోని నందిగామకు చెందిన సురేశ్‌పై ఆదివారం కేసు నమోదు చేసినట్లు సీఐ నరేశ్ కుమార్ తెలిపారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు, అసత్య ప్రచారాలు చేసే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసభ్య, విద్వేషపూరిత వ్యాఖ్యలు పోస్ట్ చేస్తే గ్రూప్ అడ్మిన్లపై కూడా చర్యలు తప్పవని ఆయన పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WAWANTED HOSPITAL STAFF
★GNM నర్సులు, మెడికల్ షాప్ సేల్స్‌మెన్స్ మరియు Lab-టెక్నిషియన్స్ అనుభవం గల వారు కావలెను. సంప్ర: గార్డియన్ హాస్పిటల్, ములుగు 'X' రోడ్, వరంగల్. 12 to 2PM.
NTW-0362

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
SepTeK
★సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.
NTW-323227

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

గొత్తికోయలతో మాట్లాడుతున్న సీఐ, ఎస్సై

మావోయిస్టులకు సాయం చేయొద్దు

గోవిందరావుపేట, మార్చి17 : మావోయిస్టులకు గొత్తికోయలు సాయం చేయొద్దని పస్రా సీఐ శంకర్ అన్నారు. ఆదివారం ఆయన ఎస్సై కమలాకర్‌తో కలిసి మచ్చాపూర్ గొత్తికోయ గ్రామాన్ని సందర్శించారు. ముందుగా గొత్తికోయల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో అపరిచితులు కనిపిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వృథాగా పోతున్న భగీరథ నీరు

వృథాగా పోతున్న నీరు

కృష్ణకాలనీ, మార్చి 17 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయం వద్ద ఆదివారం మిషన్ భగీరథ పైపులైన్‌ను బొగ్గులారీ ఢీకొట్టడంతో నీరు వృథాగా పోతున్నది. ఈ నీరు జాతీయ రహదారి పైకి చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అయినప్పటికీ మిషన్ భగీరథ అధికారులు, సిబ్బంది పట్టించుకోలేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కూడా అటువైపు రాలేదు. అధికారులు స్పందించి పైప్‌లైన్ మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

క్షతగాత్రులను ఆదుకోవాలి

కృష్ణకాలనీ, మార్చి 17 : భూపాలపల్లిలోని కమలాపూర్ క్రాస్ వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ పట్టణ కార్యదర్శి సోత్కు ప్రవీణ్ డిమాండ్ చేశారు. ఆదివారం వరంగల్ ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బొల్లి సమ్మక్క, దుర్గం రాజేశ్వరి, మంతెన లావణ్య పరిస్థితి విషమంగా ఉందని, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ భవేశ్ మిశ్రా చొరవ తీసుకొని వారిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించాలని కోరారు. ఆయన వెంట నాయకులు శ్రీకాంత్, మనోజ్, రజిత, మౌనిక, రాజేశ్ తదితరులున్నారు.

మెపా జిల్లా కమిటీ ఎన్నిక


మెపా నూతన జిల్లా కమిటీ సభ్యులు

కృష్ణకాలనీ, మార్చి 17 : ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ భూపాలపల్లి జిల్లా, యువజన విభాగం కమిటీలను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ఆదేశాల మేరకు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మెపా అధ్యక్షుడిగా గొడుగు సాహిత్, ప్రధాన కార్యదర్శిగా మండ రవీందర్, ఉపాధ్యక్షుడిగా పిట్టల లింగయ్య, యూత్ అధ్యక్షుడిగా జోరు రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా పిట్టల సాయికుమార్, ఉపాధ్యక్షులుగా పిట్టల చందు, జోరు సంతోష్‌కుమార్, కార్యదర్శిగా దాసరి రాజ్‌కుమార్, కోశాధికారిగా గోనెల సాయికుమార్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల సుభాష్ నియమాక పత్రాలు అందజేశారు.

సాహితి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

సాహితి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు, బీఆర్‌ఎస్ నాయకులు

వెంకటాపురం (నూగూరు) మార్చి 17 : ఇటీవల హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్న సాహితి కుటుంబాన్ని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పరామర్శించారు. ఆదివారం మండలంలోని ఆలుబాక గ్రామంలో సాహితి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాహితి కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంపా రాంబాబు, నాయకులు నాని, పూజారి ఆదిలక్ష్మి ఉన్నారు.

ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

ములుగు రూరల్, మార్చి17 : రాష్ట్ర ప్రభుత్వం కురుమ కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కురుమ సంఘం నాయకులు అన్నారు. ఆదివారం ములుగులో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్పొరేషన్ ఏర్పాటు ద్వారానే కురుమ కులస్తుల అభ్యున్నతి సాధ్యమవుతుందన్నారు. అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కులవృత్తులలో భాగంగా ప్రత్యేక పథకాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు కంచు ప్రభాకర్, మేకల మహేందర్, శ్రీనివాస్, మల్లయ్య, రమేశ్, సతీశ్, శ్రీనివాస్, రాజు, నరేశ్, జలేందర్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

గాండ్ల కులస్తులకు...

వెంకటాపూర్ : గాండ్ల కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని అఖిల గాండ్ల తెలికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిల్లలమర్రి రాము డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మంత్రివర్గం పలు కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసినట్లుగానే గాండ్ల కులస్తులకు ఏర్పాటు చేయాలన్నారు. తమ కులవృత్తి అంతరించిపోయి చాలా మంది పేదరికంలో మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్న 4 లక్షల 50 వేల మంది గాండ్ల కులస్తులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఐటీడీఏ సొమ్ము ఇంటి దొంగల పాలు

లక్షల విలువైన వస్తువులు మాయం

మేడారంలోని ఐటీడీఏ అతిథి గృహం

తాడ్వాయి, మార్చి17 : మండలంలోని మేడారం ఐటీడీఏ క్యాంపు కార్యాలయంలోని అతిథిగృహంలో వస్తువులు మాయమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అధికారులు సొమ్మును ఇళ్లకు తరలించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు జరిగిన అమ్మవార్ల జాతర నిర్వహణ కోసం వచ్చిన ప్రత్యేక, నోడల్ అధికారులు, ప్రోటోకాల్ అధికారుల సౌకర్యార్థం సుమారు ఐదు లక్షల విలువ గల సామగ్రి కొనుగోలు చేసి అధికారులకు అందుబాటులో ఉంచారు. జాతర ముగిసిన అనంతరం క్యాంపు కార్యాలయం నుంచి అవి మాయమయ్యాయి. క్యాంపు కార్యాలయంలో ప్రోటోకాల్ అధికారులుగా విధులు నిర్వర్తించిన కొందరు సామాన్లను వారి ఇళ్లకు తరలించినట్లుగా పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మాయమైన వస్తువులు కొందరు అధికారుల ఇళ్లలో ప్రత్యక్షం అయినట్లుగా బహిరంగంగానే ఆరోపణలు వినవస్తున్నాయి.

జాతర ముగియడమే తరువాయి

జాతర ముగియడంతో అధికారులు ఎక్కడివారు అక్కడికి వెళ్లిపోయారు. ఇంటి దొంగలకు సమయం కలిసి వచ్చింది. ఇదే అదునుగా డిన్నర్ సెట్లు, కూలర్లు, డైనింగ్ సెట్లు, మిక్సీలు, రిఫ్రిజిరేటర్లు మాయం చేశారు. సామగ్రి జాతర అనంతరం క్యాంపు కార్యాలయంలో లేదా గోడౌన్లలో భద్రపరచాల్సి ఉండగా మాయం అవడంతో అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. జాతర సందర్భంగా ఐటీడీఏ అధికారులు ప్రతిసారి లక్షల రూపాయలు వెచ్చించి అవసరమైన వస్తువులు కొనుగోలు చేస్తున్నారు. పాత వస్తువులు ఎటుపోతున్నాయో అధికారులు తెలపాల్సి ఉంది. మేడారంలోని ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో వస్తువులు భద్రపరిచినట్లు కొందరు అధికారులు చెప్పుకొస్తున్నారు. పాఠశాలలో ఎలాంటి వస్తువులు భద్రపరచలేదని మరికొందరు అంటున్నారు. ఈ విషయమై ఐటీడీఏ అధికారులను ఫోన్‌లో వివరణ అడిగేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.

తప్పిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యులకు అప్పగింత

తప్పి పోయిన వ్యక్తిని వారి కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఎస్సై భవానీసేన్

కాళేశ్వరం, మార్చి 17 : కాళేశ్వరంలో తప్పిపోయిన వ్యక్తిని పట్టుకొని వారి కుటుంబ సభ్యులకు ఆదివారం స్థానిక ఎస్సై భవానీసేన్ అప్పగించారు. శనివారం మహబూబాద్ జిల్లా నర్సింహులపేటకు చెందిన కర్ల వెంకన్న (72) కుటుంబ సభ్యుల తో కలిసి కాళేశ్వరం వచ్చారు. అక్కడ వంట చేస్తున్న సమయంలో బయటకు వెళ్లిన వెంకన్న తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఎస్సైకు సమాచారం ఇవ్వగా, ఆయన తన సిబ్బందితో కలిసి వెతికి పట్టుకున్నారు.

ప్రకాశ్‌రెడ్డి నియామకంపై హర్షం

మహదేవపూర్/కాటారం/మల్హర్, మార్చి 17 : భూపాలపల్లి డీసీసీ అధ్యక్షుడు ఐత ప్రకాశ్‌రెడ్డిని తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మహదేవపూర్ మండల కేంద్రంలోని శ్రీపాదరావు విగ్రహం వద్ద, కాటారం మండల కేంద్రంలో, మల్హర్ మండల కేంద్రం కొయ్యూరులో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీలు బన్సోడ రాణీబాయి, పంతకాని సమ్మయ్య, జడ్పీటీసీ గుడాల అరుణ, పార్టీ మండలాధ్యక్షులు అక్బర్‌ఖాన్, వేమునూరి ప్రభాకర్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ శాఖ ఈఈగా వీరభద్రం

ఏటూరునాగారం, మార్చి 17 : ఐటీడీఏ గిరిజన సంక్షేమశాఖ ఈఈగా వీరభద్రంను నియమించారు. ఇక్కడి ఈఈ హేమలత హైదరాబాద్ మైదాన ప్రాంతం ఎస్‌ఈగా బదిలీ అయ్యారు. వీరభద్రం గతంలో గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ విభాగం క్వాలిటీ కంట్రోల్ డీఈఈగా పనిచేశారు. ప్రస్తుతం పస్రాలోని గిరిజన సంక్షేమశాఖ సబ్ డివిజన్ డీఈఈగా నియమించారు. వీరభద్రానికి ఈఈగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆ శాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. సోమవారం ఆయన విధుల్లో చేరనున్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

గణపురం, మార్చి 17 : ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం పరకాల మండలం రంగాపురం గ్రామానికి చెందిన ఎంజెపల్లి రవి తన బైక్‌పై గణపురం వస్తుండగా అదే సమయంలో ములుగు జిల్లా వెంకటాపురం మండలం వెల్తుర్లపల్లికి చెందిన బీరెల్లి రాజు తన బైక్‌పై రేగొండకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో గణపసముద్రం చెరువు మత్తడి సమీపంలో ఎదురెదురుగా ఢీ కొనడంతో వారికి గాయాలు కాగా, స్థానికులు 108లో ములుగు ఆస్పత్రికి తరలించారు.

రామప్ప జర్నలిస్టు సొసైటీ కార్యవర్గం ఎన్నిక

బేతి సతీశ్

పిల్లలమర్రి శివ

వెంకటాపూర్, మార్చి 17 :మండల కేంద్రంలో రామప్ప జర్నలిస్టు సొసైటీ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బేతి సతీశ్, ప్రధాన కార్యదర్శిగా పిల్లలమర్రి శివ, గౌరవ అధ్యక్షుడిగా రామిడి కృష్ణారెడ్డి, కోశాధికారిగా నూనె నరేశ్, ఉపాధ్యక్షులుగా కేతిరి భిక్షపతి, ఒద్దుల మురళి, ముఖ్య సలహాదారుడిగా దేశిని మహేందర్, సభ్యులుగా గుణిగంటి హరీశ్, దండెపెల్లి సారంగం, మామిడిశెట్టి ధర్మతేజ, పిల్లలమర్రి రాము, ఎండీ రఫీ, అలుగొండ రమేశ్, గట్టు ప్రశాంత్ ఎన్నికయ్యారు.